**కథ**

# మనకోసం మనం

ప్రపంచంలో భయంకరమైనది ఏదైనా ఉంటే అది ఖచ్చితంగా ఒంటరితనమే! అందునా వృద్ధాప్యంలో సంభవించే ఒంటరితనం మరింత బాధాకరం. ఎక్కడికైనా వెళ్లి కాలక్షేపం చేద్దామంటే శరీరం సహకరించదు. పుస్తకాలే నేస్తాలనుకుందామంటే కళ్ళు సహకరించవు. ఉన్నచోటనే కూర్చుని కబుర్లు చెబుతూ కాలక్షేపం చేద్దామంటే చుట్టూ ఉన్న మనషులు సహకరించరు. మరెలా? ఈ వయసులో ఎదురయ్యే ఈ ఒంటరితనమనే నరకాన్ని పోగొట్టుకోవడమెలా? ఆలోచిస్తూంటే నా బుర్ర గిర్రున తిరిగింది..

మూసుకున్న కళ్ళు తెరిచి చుట్టూ చూశాను. డ్యూటీలో ఉన్న నర్సు అటు తిరిగి ఏదో చేస్తోంది. సెలైన్ నెమ్మది నెమ్మదిగా నా శరీరంలోకి ప్రవహిస్తోంది. దాన్ని చూస్తుంటే సత్తువ మాట దేవుడెరుగు... నాకు మరింత నీరసం ముంచుకొచ్చింది. మళ్లీ కళ్ల మూసుకున్నాను.

''చద్దామనుకున్నా కుదర్లేదు. అనవసరంగా బతికి బయటపడ్డాను. ఇకనుంచీ మళ్లీ ఒంటరితనం మొదలు...'' అనుకుంటూంటే మనసు బాధతో మెలిక పడింది.

''చావు సైతం నాకు కంపెనీ ఇవ్వడానికి నిరాకరించింది. ఒంటరిగా దుర్భర వేదన భరిస్తూ బతకడం కష్టం. ఇకనుంచీ బతికినన్నాళ్ళూ ఒంటరితనం తెలియకుండా బతకాలి. కానీ ఎలా?'' నాలో ప్రశ్నలమీద ప్రశ్నలు ముప్పిరిగొంటున్నాయి.

అప్పుడొచ్చింది హఠాత్తుగా ఆ ఆలోచన 'పోనీ మళ్లీ పెళ్లిచేసుకుంటే?' అని.

నా ఆలోచనకి అంతరాయంలా ముందు నా వయసు గుర్తొచ్చింది.

''ఈ వయసులో ఈయనకి పెళ్ళేవిటీ?'' అని ఎత్తి పొడిచే సంఘం గుర్తొచ్చింది 'ముసలాడికి దసరా పండుగ అంటే ఇదే'.

అసలు అందరి మాటా అనవసరం. ముందుగా నా కొడుకూ, కోడలూ, మనవడూ గుర్తొచ్చారు.

''నాన్నా!'' ఆర్తిగా ఆందోళనగా నా పుత్రరత్నం స్వరం వినిపించింది.

చప్పున కళ్ల తెరిచాను. మొదట...నా ముఖంలోకి ఆత్రుతగా చూస్తున్న కొడుకూ, ఆ వెనక కోడలూ, మనవడూ కనిపించారు.

''ఎలా ఉంది నాన్నా?'' నేను కళ్ళు తెరవడం చూసి అడిగాడు వాడు. సమాధానం చెప్పబుద్ధికాక కళ్ల మూసుకున్నాను.

ఒంటరితనం భరించలేక చద్దామనే అనుకున్నాను. అందుకు కారణం వాళ్ళే! చావలేక బతికిన వాణ్ణి. ఏమని చెబుతానూ? వాడికంటూ ఓ సంసారం ఉంది. ఆ సంసారంలో వాడి భార్యా, వాడి కొడుకూ, వాళ్లదో ప్రపంచం. ఆ ప్రపంచంలోకి నాకు ప్రవేశం లేదు. ఆ విధంగా కొడుకు నిరాదరణ వల్ల నేను ఒంటరినయ్యాను.

ఇక కోడలు... తనూ, తన టీవీ, తన స్నేహితురాళ్ళు, తన మొగుడూ, తన కొడుకూ...ఆమెదో లోకం. అందులో నేను అనే ముసలాడికి స్థానం లేదు. ఆ విధంగా కోడలు వల్ల నేను ఒంటరినయ్యాను.

ఇక మనవడు! చాక్లెట్లు కొనిచ్చి వాణ్ణి స్కూల్‌కి తీస్కెళ్లి దించడం, వాణ్ణి స్కూల్ నుంచి తీసుకొస్తూ ఏ ఐస్‌క్రీమో కొనివ్వడం. నేను వాడి తాతనీ, నాకు వాడు మనవడూ...ఈ బంధం, అనుబంధం, ఇంటికి రానంతసేపే! ఇంట్లోకి వచ్చాకా నేనెవరో, వాడెవరో అన్నట్టుంటుంది వాడి ప్రవర్తన. ఇంక ఆక్కణ్ణుంచీ వాడిలోకంలో తల్లీ తండ్రీ తప్ప తాత అనే ఓ ఏకాకి కనపడనే కనపడడు. ఆ విధంగా నేను మనవడిద్వారా కూడా ఒంటరిని.

పోనీ ఇరుగుపొరుగు వాళ్లతో అయినా కబుర్లు చెప్పి కాలక్షేపం చేద్దామటే ''మీతో మాట్లాడే విషయాలేముంటాయ్ తాతగారూ!'' అంటారు మొహం అదోలా పెట్టి. వృద్ధాప్యం అన్నా, వృద్ధులన్నా వాళ్ళకెంత ఎలర్జీనో ఆ ఒక్క ముక్కతో స్పష్టమైపోతుంది.

అలా ఏ విధంగా చూసినా నేను ఏకాకి అయినప్పుడు ఇక బతకడం ఎందుకూ? ఏకాకిలా ఎల్లకాలం బతకేకంటే ఆత్మహత్య చేసుకుని చావడం మేలనిపించి నిద్రమాత్రలు మింగేశాను. అయినా చావకుండా బతికాను. అదేం ఖర్మో?

కానీ ఈ పరిణామం నాకు సుతరామూ నచ్చలేదు. అంతేకాదు నా మానాన నన్ను చావనివ్వకుండా బలవంతంగా బతికించిన మావాడి మీద నాకు చాలా కోపంగా ఉంది.

''నామీద కోపమా నాన్నా?'' జాలిగా అడిగాడు వాడు.

నేను అవుననలేదు, కాదనలేదు. కళ్ల కూడా తెరవలేదు.

''అసలు ఎందుకు చేశావింతపని? నీకు మేమేం లోటు చేశామని?'' అడుగుతుంటే వాడి స్వరం దుఃఖంతో బొంగురుపోయింది.

అప్పుడు... ఠక్కున కళ్ల తెరిచాను.

మావాడు ఏడుస్తున్నాడు. వాడి ఏడుపు చూస్తే నాకు జాలెయ్యలేదు సరికదా కోపం ముంచుకొచ్చింది.

''వేళకింత తిండి పారెయ్యడం, పండుగలకీ, పబ్బాలకీ కొత్తబట్టలు కొనివ్వడం, మందులూ-మాకులూ ఇప్పించడం... ఇది కాదురా లోటు లేకుండా చూడడం అంటే! ఈ వయసులో ముసలాళ్లకి ఒంటరితనమనేదే లేకుండా చెయ్యాలి. అదీ గొప్పతనం!'' విసురుగా అన్నాను.

''ఎలా నాన్నా? మొగుడూ పెళ్లాం కలిసికట్టుగా కష్టం చేసినా సంపాదన చాలని రోజులివి. ఇలాంటి సందర్భంలో నామీద ఆధారపడ్డ మిమ్మల్నందర్నీ ఏ లోటూ లేకుండా చూసుకోవాలంటే నేను పరుగులెత్తాలి. సంపాయించాలి. ఆ హడావిడిలో నాకు మీతోనే కాదు, భార్యాబిడ్డల్తో గడపడానికి సైతం సమయం చాలదు. పరుగెత్తాల్సిన సమయంలో పరుగెత్తకపోతే పడిపోతాం నాన్నా! జీవితమనే ఆటస్థలంలో అభివృద్ధి అనే పరుగు పందెంలో ఓడిపోతాం. ఆ తర్వాత ఇక మాకు బరిలో నిలబడడానికి కూడా చోటుండదు. ఈ కాలం పెద్దలు, పిల్లలూ వాళ్లతో ఎంత సమయం గడిపారన్నది కాదు. ఎంత ప్రేమగా గడిపారన్న విషయం మాత్రమే ఆలోచించాలి. అర్థం చేసుకోవేం నాన్నా?'' నిస్సహాయంగా ఆవేదనగా అన్నాడు.

ఎప్పుడూ చెప్పే మాటలే ఇవి. వాడెంత వేదనని వెలిగ్రక్కినా నా మనసు కరగలేదు, కదల్లేదు. నాలోని కోపం అలానే నిలిచిపోయింది. రెండురోజుల తర్వాత...నన్ను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేశారు.

ఇంటికి రాగానే బంధుమిత్రుల రాకలూ..పరామర్శలూ...''అయ్యో! ఈ వయసులో ఎందుకిలా చేశారూ?'' అన్న మందలింపులూ...''మీ కొడుకూ, కోడలూ మీకేమైనా లోటు చేశారా? లేకపోతే మీరింత సాహసం చెయ్యరుగా!'' అన్న లోపాయికారీ ఆరాలూ..ఒకటేమిటి? నానారకాల తలనొప్పులూనూ!

''మేం మిమ్మల్ని కాలు కింద పెట్టనివ్వకుండా చూశాం. అయినా చుట్టుపక్కల వాళ్లలోనూ, చుట్టాలూ, పక్కాల్లోనూ మాకు నిందలు తప్పలేదు. అంతా మా ఖర్మ!'' అంటూ కోడలు చాలాసార్లే నిష్ఠూరమాడింది.

ఇదివరకూ నాలో ఉన్నది కేవలం ఒంటరినన్న బాధ మాత్రమే! ఇక ఇప్పట్నుంచీ కోడలు అనే సూటిపోటీ మాటల్ని కూడా భరించాలి కాబోలు! అలా అయితే ముందున్న జీవితం మరింత దుర్భరంగా మారుతుంది అనిపించింది.

ఏదేమైనా సరే! రాబోయే క్షణం గురించీ, ఆ నిమిషంలో నేననుభవించబోయే ఒంటరితనం గురించీ ఇక ఆలోచించదల్చుకోలేదు.

ఆ రాత్రి-


''నేనో రెండు నెలల పాటు లీవ్ పెడదామనుకుంటున్నాను. మెడికల్ లీవ్‌కి అప్లై చేశాను'' నా దగ్గరకొచ్చి చెప్పాడు మావాడు.

''ఎందుకూ?'' అని నేనడగలేదు. అడగాలనీ అనిపించలేదు.

''ఫలానా ఇందుకు'' అని వాడూ చెప్పలేదు.

వారం తర్వాత ఓరోజు ఉదయం! బెడ్ కాఫీతో నన్ను నిద్రలేపాడు మావాడు. కాఫీ అందుకుంటూ ఆశ్చర్యపోయాను. కాఫీగ్లాసు నాచేతికి అందించి న్యూస్ పేపర్‌లో హెడ్‌లైన్స్ చదివి వినిపించాడు.

ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిపోయాను. అవుతూనే ఆసక్తికరంగా అనిపించిన హెడ్‌లైన్స్ తాలూకు వివరాలు అడిగితే మొత్తం చదివి వినిపించాడు మావాడు. ఆ కార్యక్రమం అంతా పూర్తయ్యేసరికి బాబిగాడు రెడీ అయ్యాడు. వాణ్ణి తీస్కెళ్లి స్కూల్లో దించి వస్తానని చెప్పి వెళ్లిపోయాడు మావాడు.



అగస్త్యప్రగడ హేమంత

నేను మెల్లగా లేచి స్నానాదికాలన్నీ ముగించుకుని హాల్లోకి చేరేసరికి మావాడు తిరిగొచ్చేశాడు. ఇద్దరం కలిసి టిఫిన్ చేశాం. తిన్నవి రెండు ఇడ్లీలే అయినా ఎందుకో చాలా ఆయాసంగా అనిపించింది. ఆ క్షణంలో నా కడుపుని అంతలా నింపేసినవి ఇడ్లీలు కావు. కొడుకుతో 'కబుర్లు చెబుతూ' తిన్నానన్న ఆనందం.


నిజమే! ఆఫీస్‌కి వెడుతూ ఆ హడావిడిలో ఆదరాబాదరాగా వాడు టిఫిన్ నోట్లో కుక్కుకుని గొంతులోకి ఇన్ని నీళ్ళు వంపుకుని...''నాకు ఆఫీస్‌కి టైమవుతోంది. నా సంగతేం కానీ..నువ్వు స్థిమితంగా తిను. టాబ్లెట్ వేసుకో! రెస్ట్ తీసుకో!'' అనేసి వెళ్లిపోవడానికి, ఏవేవో కబుర్లు చెబుతూ నా పక్కనే కూచుని టిఫిన్ తినడానికి చాలా తేడా ఉంది. ఇప్పుడు నాలో ఉన్నది వాడు స్థిమితంగా తిన్నాడన్న సంతోషం. వాడికి కడుపు నిండితే నాకూ నిండినట్టేగా!


ఆ తర్వాత మావాడు ''గుడికి వెడదాం నాన్నా!'' అన్నాడు. మళ్లీ ఇద్దరం పక్కపక్కనే నడుచుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ గుడికి వెళొచ్చాం.

ఆరోజు... ప్రతీక్షణం నా పక్కనే ఉంటూ, నాతో ఎడతెరిపి లేని కబుర్లు చెబుతూనే ఉన్నాడు మావాడు.

ఆ ఒక్కరోజే కాదు.. ఆ తర్వాత నెలవరకూ అదే తంతు.

నాకు ఆనందంగా ఉంది. ఆశ్చర్యంగానూ ఉంది. అన్నిటినీ మించి నేను ఏకాకిని కాను. నాకు నా కొడుకు ఉన్నాడు. నాకోసం వాడు ఏం చెయ్యడానికైనా సిద్ధంగా ఉన్నాడు అన్న తృప్తి నన్ను నిలువునా ఆక్రమించుకుంది. ఆ



క్షణం నుంచి నాలో కాలమిలాగే ఆగిపో బావుం డునన్న అత్యాశ కూడా చోటుచేసుకుంది.

చాలాకాలం తర్వాత జరుగుతున్నది కాదు. నిజమే అన్న విషయం నిర్ధారణ చేసుకుని ప్పుడు హాయిగా నిద్రపోయాను.

గాఢనిద్రలో ఉన్న నాకు ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చుట్టూ చూశాను. కారణం అర్థం కాలేదు.

కారణం కోసం అన్వేషిస్తూంటే గడియారం ఠంగుఠంగున గంటలు కొట్టింది. లె పెడితే పన్నెండు.

ఎందుకో ఇక నిద్రపట్టదనిపించి . లేచి కూర్చున్నాను. బాత్రూంకెళ్ళాలనిపించి . లేచి ఇవతలకొస్తూంటే... మావాడి గదిలో లైటింకా వెలుగుతూ కనిపించింది. వాడూ వాడి భార్యా మాట్లాడుకుంటున్నారు. నాకు జాలేసిం.

''వెర్రి నాగన్న! పగలంతా నాతోనే గడుపుతున్నాడు. కోడలితో కబుర్లు చెప్పడం కోసం నిద్రని వాయిదా వేసి రాత్రిపూట కేటాయిం చాడన్నమాట!'' అనుకున్నాను.

గాఢంగా నిట్టూర్చి ముందుకి కదలబోయాను. ఇంతలో వాళ్ళ మాటల మధ్య నా ప్రసక్తి! సంస్కారం కాదని తెలిసినా కుతూహలం చంపుకోలేక ఆగిపోయి చెవులు రిక్కించాను.

''ఈనెల ఎలా గడపాలని నాకర్థం కావట్లేదు'' కోడలి గొంతు బేలగా వినిపించింది.

''ఏం కంగారుపడకు. నేనేదో నేజ్ చేస్తాలే!'' మావాడు ధైర్యం చెబుతున్నాడు

''ఈ నెల సరే! మళ్లీ నెల కూడా మెడికల్ లీవ్ మూలంగా మీకు సగం జీతమే వస్తుందిగా! అప్పుడేం చేద్దాం?''

''శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలున్నాయి. కొన్ని ఖర్చులు తగ్గించుకుందాం! ఈ నెలలాగే వచ్చేనెల కూడా నువ్వూ నేనూ కాఫీ, టిఫినూ మానేద్దాం.

ఆమేరకి కొంత ఖర్చు తగ్గుతుంది. బాబిగాణ్ణి ఈ రెండునెలలూ ఎలాగూ ట్యూషన్ మాన్పించెయ్యాలని నిర్ణయించుకున్నాం కదా! పాలకీ, పచారీ కొట్టు ఓనర్కీ వాళ్ల వాళ్ళ బాకీలు నెమ్మదిగా నెమ్మదిగా తీరుద్దామని చెబుదాం! ఇలాగే ఏవేవో చిన్న చిన్న అడ్జస్ట్మెంట్లు.. ఎన్ని వీలైతే అన్నీ చేద్దాం...'' మావాడు చెప్పుకుపోతుంటే కోడలు సంగతేమోగానీ వింటున్న నాకు మాత్రం బుర్రగిర్రున తిరిగిపోయింది.

ఇక అక్కడ నిలబడలేనట్టుగా గోడల్ని ఆసరా చేసుకుంటూ వచ్చి మంచం మీద పడిపోయాను.

నా మనసంతా ఆవేదనతో నిండిపోయింది. కొడుకు నాతో గడుపుతున్నాడనీ.. నా ఒంటరితనాన్ని పోగొడుతున్నాడనీ మురిసిపోయానే కానీ... దాని వెనుక ఇంత త్యాగం ఉందనీ, ఇన్ని ఇబ్బందులున్నాయనీ గ్రహించుకోలేకపోయాను.

నిజమే! తల్లితండ్రుల కోసం పిల్లలు ప్రాణాలివ్వడానికైనా సిద్ధపడతారు. అంతమాత్రాన పెద్దాళ్లంతా పిల్లల ప్రాణాన్ని కోరుకోకూడదుగా! ఎంత పొరపాటు చేశానిన్నాళ్ళూ. ఎప్పుడూ నా ఒంటరితనం గురించే ఆలోచించుకున్నాను తప్ప నాకుగా నేను ఏనాడూ నా ఒంటరితనాన్ని పోగొట్టుకోవడానికి ప్రయత్నించుకోలేదు. అసలు నేను ఒంటరిని కాను! అనుకున్నా ఈనాడు నాకూ నాతో పాటు మావాడికీ ఈ బాధలు తప్పేవి. చాలా పొరపాటు చేశాను.

మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండడం భాగ్యమే కానీ అలా అనుకుంటూ మనసు కోసమూ మనిషి కోసమూ అన్వేషించడం మొదలెడితే బతుకంతా వెదుకులాటతోనూ, నిరీక్షణతోనూ అయిపోతుంది.

ఏ తోడూ లేనినాడు మన నీడే మనకి తోడు అనుకుంటే జీవితమంతా విజయ పరంపరతోనూ అద్భుతమైన మలుపులతోనూ నిండిపోతుంది.

ఎందుకోసం? అనుకుంటే పని దండుగవుతుంది. ఎవరికోసం అనుకుంటే బతుకు భారమవుతుంది. మన కోసం మనం అనుకుంటేనే జీవితం పూలబాటవుతుంది అనిపించింది.

అంతే! అక్కడితో నా ఆలోచనలన్నీ మారిపోయాయి. ఇప్పుడు సైతం నేను పుస్తకాలు చదవను. ఎక్కడికీ వెళ్ళను. అలా అని అంతా నా చుట్టూ చేరి కబుర్లు చెప్పాలనీ అనుకోవడం లేదు. నాకు నావాళ్ళున్నారు. నేను ఒంటరిని కాను అని మాత్రం అనుకుంటాను. తోటలో మొక్కల పని చూస్తాను. నాకిష్టమైన పాటలు వింటున్నాను. సాయంత్రాలు గుడికి వెళ్లి రోజూ వచ్చే నాబోటివారితో కాలక్షేపం చేయడం మొదలుపెట్టాను. ✪

## భలే చాన్సులే...

ఈమధ్య జాకీష్రాఫ్ కలిస్తే ప్రశ్నల వర్షం కురిపించాం!

ఏమిటీ! చాలా హేపీగా వున్నారు?

★ అవును! నా ఇన్నాళ్ల కోరిక తీరబోతోంది.

ఏమిటో అది?

★ అనాటి నంబర్ వన్ రేఖతో నటించాలని నా కోరిక. ఇన్నాళ్లకి తీరుతోంది.

ఎలాగబ్బా?

★ 'కోయీ మిల్ గయా' చిత్రంలో హృతిక్కి తండ్రిగా, రేఖకు భర్తగా నటిస్తున్నాను.

